క్లుప్తంగా

వైభవంగా అయ్యప్ప కలశ పూజోత్సవం



పెదపట్నంలంకలో అయ్యప్ప పూజలో పాల్గొన్న స్వాములు

మామిడికుదురు: అయ్యప్పస్వామి 18 కలశాల పూజ గురువారం రాత్రి పెదపట్నంలంకలో వైభవంగా జరిగింది. పిల్లి శ్రీను స్వామి స్వగృహం వద్ద ఈ పూజా కార్యక్రమం కన్నుల పండుగలా జరిపించారు. ముందుగా స్వాములు పేటతుల్లి ఆడుతూ మేళతాళాలు, బాణసంచా కాల్పులతో కలశాలను గ్రామంలో ఊరేగిస్తూ వైనతేయ గోదావరి నదికి ఊరేగింపుగా వెళ్లారు. అక్కడి నుంచి కలశాలతో గోదావరి నదీ జలాలు తీసుకు వచ్చి పూజలు చేశారు. పెదపట్నానికి చెందిన జయంతి సుబ్బారావు గురుస్వామి ఆధ్వర్యంలో వినాయకునికి, సుబ్రహ్మణ్యస్వామికి, కనకదుర్గమ్మకు పూజలు చేయించారు. అయ్యప్ప స్వామికి పంచామృతాలు, పుష్పాలతో అభిషేకం చేశారు. అనంతరం సహస్ర నామాలతో అర్చన చేశారు. మానేపల్లికి చెందిన కాలిశెట్టి ప్రకాష్ గురుస్వామి ఆధ్వర్యంలో ఆలపించిన ఆధ్యాత్మిక గీతాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

స్వామి కల్యాణంతో పులకించిన భక్త జనం



కల్యాణ వేదికపై కొలువు తీరిన శ్రీబాల బాలాజీ స్వామి

మామిడికుదురు: అప్పనపల్లిలో కొలువైన శ్రీబాల బాలాజీ స్వామి తమ గ్రామానికి రావడం ఎంతో ఆనందంగా ఉందని పాశర్లపూడిలంక వాసులు శుక్రవారం ఆనంద పరవశులయ్యారు. పల్లకిలో ఊరేగుతూ కల్యాణ వేదిక వద్దకు వస్తున్న స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న భక్తులు గోవిందా! గోవిందా! గోవింద! అంటూ తన్మయత్వం చెందారు. ధర్మ ప్రచార వారోత్సవాల్లో భాగంగా అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి కల్యాణోత్సవం పాశర్లపూడిలంకలో గ్రామ దేవత చింతాలమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో వైభవంగా జరిగింది. వేద పండితుడు జోస్యుల సోమయాజులు కల్యాణోత్సవాన్ని జరిపించారు. పలువురు భక్త దంపతులు కర్తలుగా పాల్గొన్నారు. భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ ఈఓ జి.మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ పర్యవేక్షణలో జరిగిన కల్యాణోత్సవంలో సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, ఎంపీటీసీ సభ్యురాలు చెరుకూరి పార్వతీదేవి, ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

గంగలకుర్రులో సినీ షూటింగ్ సందడి



షూటింగ్‌కు సిద్ధమైన ప్రభ

అంబాజీపేట: కుటుంబ కథ నేపథ్యంతో పాటు స్నేహానికి విలువనిచ్చే విధంగా హాస్యభరితమైన కథనంతో కూడిన చిత్రాన్ని ప్రేక్షకులకు అందించనున్నట్లు గీతా ఆర్ట్స్–2 చిత్ర ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ అజేయ్ గద్దే తెలిపారు. గంగలకుర్రులో సినీ షూటింగ్ శుక్రవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఈ సినిమాలో హీరోగా జూనియర్ ఎన్టీఆర్ బావమరిది నార్ని నితిన్, హీరోయిన్‌గా నయినా సారిక నటిస్తున్నారన్నారు. కోనసీమ ప్రాంతానికి చెందిన యువ దర్శకుడు అంజిబాబు కంచిపల్లి దర్శకత్వంలో విద్యా కొప్పినీడి, బన్నీ వాసులు నిర్మాతలుగాను, రామ్ నివ్వ, అజేయ్ అరసాద్‌లు సంగీతాన్ని, కెమెరా మెన్‌గా సమర్ వ్యవహరించనున్నారన్నారు. ఈ నెల 24న తమ 8వ సినిమా అయిన కోటబొమ్మాళి పీఎస్ సినిమా విడుదల కానుందన్నారు. షూటింగ్‌లో భాగంగా మురళీ కోలాటం, ప్రభల తీర్థం, దేవతామూర్తుల వాహనాలను ఏర్పాటు చేశారు.

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి



విద్యార్థులతో మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

మామిడికుదురు: విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి అధ్యాపకులు కృషి చేయాలని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి ఎస్వీ సత్యనారాయణ రెడ్డి సూచించారు. ఆయన శుక్రవారం మామిడికుదురు ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. నాడు–నేడు ద్వారా చేసిన వివిధ అభివృద్ధి పనుల ద్వారా కలిగిన వసతలను విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. 2023 మార్చిలో ఉత్తీర్ణతా శాతంలో మామిడికుదురు కళాశాల జిల్లాలో మొదటి స్థానంలో నిలిచినందుకు ప్రిన్సిపాల్ కేఎస్‌వీఎస్ఎస్ యేసు బాబు, అధ్యాపకులను అభినందించారు.

హైవే అంబులెన్స్ సేవలు అద్వితీయం

- క్షతగాత్రులకు రక్షణగా 'సాస్'
- ప్రమాద బాధితులకు సకాలంలో వైద్యం
- 1033 టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు



జాతీయ రహదారి (హైవే 216 ఏ) ప్రయాణికులకు సత్వర సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన అంబులెన్స్



జొన్నాడలో ఏర్పాటు చేసిన ఎమర్జెన్సీ కాల్ బాక్సు (ఈసీబీ)



అధునాతన సౌకర్యాలతో అంబులెన్స్ లోపలి భాగం

ఆలమూరు: జాతీయ రహదారి 216 ఏ (హైవే)లో ప్రమాదాలు సంభవించినప్పుడు క్షతగాత్రులకు సత్వర సేవలను అందించేందుకు వీలుగా సరికొత్త సాంకేతిక పరిజ్ఞాన వ్యవస్థతో పాటు అధునాతన సౌకర్యాలతో కూడిన బేసిక్ లైవ్ సపోర్ట్ (బీఎల్ఎస్) అంబులెన్స్ ప్రయాణికులకు, వాహనదారులకు విశేష సేవలను అందిస్తుంది. తూర్పుగోదావరి జిల్లా దివాన్ చెరువు నుంచి పశ్చిమగోదావరి జిల్లా సిద్ధాంతం వరకూ 60 కిలోమీటర్ల మేర పరిధిలో ఈ అంబులెన్స్ అందుబాటులో ఉంటుంది. మొబైల్ ద్వారా 1033 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలియజేసినా సత్వరమే అంబులెన్స్ ముంగిట ఉంటుంది. దీంతో పాటు ఇప్పటికే జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదాన్ని సకాలంలో గుర్తించి క్షతగాత్రులకు, బాధితులకు సత్వర సేవలు అందించేందుకు సేవ్ అవర్ సోల్ (సాస్) పేరిట టెలిఫోన్ గుర్తుతో ఎమర్జెన్సీ కాల్ బాక్సు (ఈసీబీ)ల ఏర్పాటు ఇప్పటికే జరిగింది. టోల్ ఫ్రీ నంబర్ తెలియని ప్రయాణికులు ప్రమాదం జరిగిన వెంటనే హైవే పక్కన ఎర్రటి బాక్సు ఆకారంలో ఉండే ఈసీబీ వద్దకు వచ్చి బటన్ నొక్కితే హైవే కంట్రోల్‌కు సమాచారం వెళుతుంది. ఆ కంట్రోల్ రూమ్ నుంచి వెంటనే ఈసీబీకి ఫోన్ చేసి ఫిర్యాదు చేసిన ప్రయాణికుడి నుంచి వివరాలను సేకరిస్తుంది. దీంతో ఆ ప్రదేశానికి కొన్ని నిమిషాల వ్యవధిలోనే హైవే సిబ్బందితో పాటు అంబులెన్స్ వేగంగా చేరుకుని సత్వరమే వైద్య సేవలను అందిస్తుంది. అలాగే ట్రాఫిక్ ఇబ్బందులుంటే తొలగించి క్షతగాత్రులను మెరుగైన వైద్యం సేవలు కోసం ఆస్పత్రికి తరలిస్తుంది. గతంలో మాదిరిగా హైవేకు సంబంధించి నంబర్లు వెతుక్కుని ఫోన్ చేయాల్సిన అవసరం లేకుండా హైవే అథారిటీ ఈ ప్రక్రియను చేపట్టింది. ప్రతి రెండు కిలోమీటర్ల మేర టెలిఫోన్ మాదిరిగా 140 ఈసీబీలను అందుబాటులోకి తీసుకువచ్చింది.

ప్రాణాలను రక్షించే బేసిక్ లైవ్ సపోర్ట్ అంబులెన్స్

హైవే ప్రమాద బాధితుల ప్రాణాలు కాపాడే ఈ అంబులెన్స్‌ను హైవే అధికారగణం బేసిక్ లైవ్ సపోర్ట్ అంబులెన్స్‌గా పిలుస్తున్నారు.

గత ఏడాది రూ.35 లక్షలతో కొనుగోలు చేసిన అధునాతన సౌకర్యాలతో కూడిన అంబులెన్స్ మినీ ఆపరేషన్ థియేటర్ మాదిరిగా సేవలను అందిస్తుంది. రోడ్డు ప్రమాదాలు జరిగేటప్పుడు క్షతగాత్రుల రక్తస్రావ నివారణను సత్వరం అరికట్టేందుకు వీలుగా ప్రత్యేక పరికరాలు నిక్షిప్తమై ఉన్నాయి. అలాగే గుండెపోటుకు గురైన రోగులకు అధునాతనమైన డిఫిబ్రిలేషన్ మెషీన్ అందుబాటులో ఉంది. ఒకేసారి ఇద్దరు క్షతగాత్రులను తరలించే విధంగా రెండు బెడ్‌లు, ఆక్సిజన్ సిలిండర్లు అమర్చబడ్డాయి. ప్రాథమిక చికిత్సను అందించేందుకు వీలుగా అంబులెన్స్‌లో డ్రైవర్‌తో పాటు ఇద్దరు ఆరోగ్య నిపుణులు ఉంటారు.

ప్రయాణికుల ప్రాణాల రక్షణే తక్షణ కర్తవ్యం

జాతీయ రహదారిలో ప్రమాదానికి గురైన ప్రయాణీకులకు సత్వర సేవలను అందించి ప్రాణాలను రక్షించేందుకు ఎన్‌హెచ్ఏఐ బీఎల్ఎస్ అంబులెన్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈఅంబులెన్స్‌కు వేగ పరిమితి అధికంగా ఉండటం వల్ల ప్రమాదం జరిగిన కొద్ది నిమిషాల్లోనే సంఘటనా స్థలానికి చేరుకునే విధంగా అంబులెన్స్ పార్కింగ్‌ను ఏర్పాటు చేశాం.

– కె.సత్యనారాయణరెడ్డి, టోల్ ప్లాజా మేనేజర్, ఈతకోట

భక్తి శ్రద్ధలతో నాగుల చవితి



కొత్తపేట మండల పరిషత్ ప్రాంగణంలో పుట్ట వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆలమూరు: కార్తికమాసంలో వచ్చే తొలి పండగ నాగుల చవితి పర్వదినాన్నివివిధ గ్రామాల్లోని భక్తులు శుక్రవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. నాగేంద్రుడి కరుణాకటాక్షాలు ఉంటే విష సర్పాల వల్ల ఎటువంటి రుగ్మతలు దరిచేరవని భక్తుల విశ్వాసం. గ్రామాల్లోని వ్యవసాయ కుటుంబీకులు ఎక్కువగా ఈ నాగుల చవితి పండగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో ఆయా గ్రామాల్లో మహిళలు, రైతులు సుదూర ప్రాంతాల్లోనున్న పొలాల్లోకి వెళ్లి పాలు, కోడిగుడ్లు, చిమ్మిలి, చలివిడి తదితరాలు పుట్టలో వేసి నాగేంద్రుడికి నైవేద్యాన్ని అందజేశారు. పసుపు, కుంకుమలతో నాగేంద్రుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పి.గన్నవరం: మండలంలోని భక్తులు గ్రామాల్లోని పుట్టల వద్దకు వెళ్లి పూజలు చేశారు. పుట్టల్లో పాలు, గుడ్లు వేసి నాగేంద్రునికి నైవేద్యాలు సమర్పించారు. పి.గన్నవరం కొత్త అక్విడెక్టుకు ఇరు వైపులా ఉన్న పార్కుల్లోని పుట్టలు భక్తులతో కిటకిటలాడాయి.

ఆత్రేయపురం: స్థానిక శ్రీవల్లి దేవసేన సమేత సంతాన సుబ్రహ్మణ్య స్వామి, శ్రీవినాయక సుబ్రహ్మణ్యేశ్వర రాధాకృష్ణుల ఆలయం భక్తులతో కిటకిటలాడింది. వాడపల్లి , వసంతవాడ, పేరవరం, ర్యాలి, వెలిచేరు, వద్దిపర్రు గ్రామాల్లో భక్తులు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో నాగుల పుట్టల వద్ద పిల్లలు, పెద్దలు పుట్టలో పాలు పోసుకుని పూజలు నిర్వహించారు.

అంబాజీపేట: మండలంలో నాగులచవితిని సంప్రదాయ బద్ధంగా జరిపారు. మహిళలు, చిన్నారులు ఈ పూజలలో పాల్గొన్నారు. గ్రామాల్లో ప్రజలు తెల్లవారు జాము నుంచి పుట్టల వద్ద పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

కొత్తపేట: మండలంలో నాగుల చవితి పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పాముల పుట్టల వద్దకు వెళ్లి వాటిని శుభ్రం చేసి నాగేంద్రునికి పసుపు, కుంకుమ, పువ్వులు, అక్షింతలతో పూజ చేశారు.

మామిడికుదురు: నాగుల చవితి పండగను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. భక్తుల కోసం పుట్టల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. లౌడు స్పీకర్లు ఏర్పాటు చేశారు. మామిడికుదురు, నగరం, పెదపట్నం, బి.దొడ్డవరం, పాశర్లపూడి, అప్పనపల్లి, పెదపట్నంలంక, మొగలికుదురు, గెద్దాడ, పాశర్లపూడిలంక, లూటుకుర్రు, ఆదుర్రు, మగటపల్లి, కొమరాడ, గోగన్నమఠం, ఈదరాడ, కరవాక, మాకనపాలెం, కరవాక గ్రామాల్లో నాగుల చవితి వేడుకలు వైభవంగా జరిగాయి.

రావులపాలెం: మండలంలోని గ్రామాల్లో కార్తిక శుద్ధ చవితి సందర్భంగా మహిళలు, పిల్లలు, ఉదయాన్నే పుణ్యస్నానాలు ఆచరించి పొలాల్లోని, పుంత గట్ల సమీపంలో ఉన్న పాముల పుట్టల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టల వద్ద పూజలు చేసి ఆవుపాలు, కోడిగుడ్లు, చిమ్మిలి, చలివిడి పుట్టల్లో వేశారు. పుట్టల చుట్టూ ప్రదక్షిణలు చేశారు.

మేలు చేస్తున్న సీఎం జగన్‌నే మళ్లీ గెలిపించాలి



సభలో పాల్గొన్న ఎమ్మెల్యే రాపాక. మాట్లాడుతున్న ఆయన తనయుడు వెంకట్రామ్

ఎమ్మెల్యే రాపాక పిలుపు

సఖినేటిపల్లి: సంక్షేమ పథకాల ద్వారా మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ సీఎంగా గెలిపించాలని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శుక్రవారం రామేశ్వరంలో ఎమ్మెల్యే రాపాక, తనయుడు రాపాక వెంకట్‌రామ్‌తో కలిసి అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి సీఎం జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ ఫలాలు వివరించే బ్రోచర్లను ఎమ్మెల్యే అందజేశారు. సాంకేతిక కారణాలతో పథకాలు అందని అర్హులకు అందజేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ, కుల, మత, ప్రాంతాలకు అతీతంగా పథకాలు అమలు చేస్తున్న సీఎం జగన్‌కు అందరమూ సహకరిద్దామని పిలుపునిచ్చారు. సర్పంచ్ కట్టా ఉమా మహేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎంపీటీసీ సభ్యురాలు దొండపాటి సునీత, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, పార్టీ మండల ప్రెసిడెంట్ కుసుమ చంద్రశేఖర్, వైస్ ప్రెసిడెంట్ పెదపాటి నాగలక్ష్మి, గ్రామ శాఖ అధ్యక్షుడు బళ్ళ లక్ష్మణ్, నియోజకవర్గ బూత్ కమిటీల కో ఆర్డినేటర్ కె.అశోక్ పాల్గొన్నారు.

మలికిపురం: ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డినే రాష్ట్రానికి మరోసారి సీఎంగా ఎన్నుకుందామని రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాద్ అన్నారు. మండలంలోని చింతలమోరి సచివాలయంలో శుక్రవారం జరిగిన ఏపీకి వై నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. చింతలమోరిలో రూ.27.16 కోట్లతో ఇంతవరకు అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. 8,666 లబ్ధిదారులకు పథకాలు అందాయని తెలియజేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు బల్ల ప్రసన్నకుమారి, ఎంపీటీసీ సభ్యుడు తోటే రాజేష్ ఎంపీడీవో ముత్యం వీరాస్వామినాయుడు, జేసీఎస్ కన్వీనర్ చింత రాజబాబు, మండల పార్టీ అధ్యక్షుడు అడబాల బ్రహ్మాజీ, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లి శివకుమార్, ఉప సర్పంచ్ బాలగంగాధర్, గ్రామ శాఖ అధ్యక్షుడు బోనం వెంకట రామారావు పాల్గొన్నారు.

గల్ఫ్ బాధితులకు అండగా ఏపీఎన్ఆర్‌టీఎస్



అవగాహన పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏపీఎన్ఆర్‌టీఎస్ బృందం

రాజోలు: గల్ఫ్ బాధితులకు ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఏపీఎన్ఆర్‌టీఎస్) అండగా నిలుస్తుందని డిప్యూటీ డైరెక్టర్ కరీం అన్నారు. సర్పంచ్ రేవు జ్యోతి అధ్యక్షతన స్థానిక అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో ఏపీఎన్ఆర్‌టీఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. సీఐ గోవిందరాజు మాట్లాడుతూ ప్రవాసాంధ్రుల సంక్షేమం, భద్రత, అభివృద్ధి ధ్యేయంగా ప్రపంచ వ్యాప్తంగా ఎన్ఆర్‌టీఎస్ సేవలు అందిస్తోందన్నారు. ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లే కార్మికులు గుర్తింపు లేని సంస్థలు, ఏజెంట్ల చేతుల్లో మోసపోకుండా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారన్నారు. గల్ఫ్‌లో ఇబ్బందులు పడే కార్మికుల సహాయం కోసం 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా 08863 2340678 హెల్ప్ లైన్ నంబర్, 8500027678 వాట్సాప్ నంబర్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్సై పృథ్వీ, వైఎస్సార్ సీపీ జోనల్ హెడ్ అజయ్‌భూపతి, తాడి సహదేవ్, ఎన్ఆర్‌టీఎస్ అడిషనల్ డైరెక్టర్ కల్యాణ్‌కుమార్, కొల్లు సరోజిని, గంజి వెంకట లక్ష్మి, రవికుమార్, నోబుల్, నానాజీ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే గ్రామాభివృద్ధి

ఆలమూరు: చెముడులంక గ్రామాన్ని రూ.పది కోట్లతో అభివృద్ధి చేశామని సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు తెలిపారు. పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గురువారం గ్రామంలో పర్యటించిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు సత్యానందరావు తమ గ్రామాభివృద్ధిపై విమర్శలు చేయడం, వైఎస్సార్ సీపీపై బురద జల్లడం విడ్డూరంగా ఉందన్నారు. టీడీపీ హయాంలో నిర్మించిన పాఠశాల భవనాల శ్లాబులు నీరుగారిపోతున్నాయని, కమ్యూనిటీ హాలు ద్వారా వచ్చే ఆదాయాన్ని మూడేళ్ల పాటు మీ నాయకుడే స్వాహా చేశారని అన్నారు. గ్రామాభివృద్ధి ఎవరి హయాంలో జరిగిందో అనే విషయంపై చర్చకు తాము సిద్ధమేనన్నారు. ఉప సర్పంచ్ దొండపాటి వీర వెంకట్రావు, మాజీ సర్పంచ్ బుడ్డిగ వీర వెంకట్రావు, అడబాల వెంకట్రావు, అడబాల శ్రీనివాసు పాల్గొన్నారు.

9లోగా దరఖాస్తులను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డీ రమణారెడ్డి

ఎన్నికల రిటర్నింగ్ అధికారి రమణారెడ్డి

పి.గన్నవరం: నియోజకవర్గంలోని ఓటర్ల జాబితాల్లో అభ్యంతరాలను, కొత్త దరఖాస్తులను వచ్చే నెల 9లోగా పరిష్కరించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.రమణారెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పి.గన్నవరం, అంబాజీపేట, అయినవిల్లి, మామిడికుదురు మండలాలకు చెందిన బీఎల్‌ఓలతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో మొత్తం ఫారం–6 దరఖాస్తులు 2,246, ఫారం–7లు 859, ఫారం–9 లు 912 వచ్చాయని ఆయన వివరించారు. అర్హత గల కొత్త ఓటర్లను గుర్తించి నమోదు చేయాలన్నారు. కళాశాలల్లో సదస్సులు ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. తహసీల్దార్‌లు జి.రవీంద్రనాథ్ ఠాగూర్, రియాజ్ హుస్సేన్, టి.మంగతాయారు, టీడీలు బి.గోపాలకృష్ణ, అశోక్ పాల్గొన్నారు.

టీటీ పోటీల్లో వైవీఆర్ అండ్ బీఆర్ఎం కళాశాల విద్యార్థుల ఎంపిక



విజేతలతో కళాశాల సిబ్బంది

అయినవిల్లి: ఆదికవి నన్నయ్య యునివర్సిటీ ఆధ్వర్యంలో ముక్తేశ్వరం వైవీఎస్ అండ్ బీఆర్ఎం కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ వద్ద ఇంటర్ కాలిజెట్ మెన్స్, విమెన్స్ విభాగంలో టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహించారు. మెన్స్ విభాగంలో విన్నర్స్‌గా గోపన్నపాలెం ఎస్ఎస్ఆర్ జీసీసీఈ కళాశాల విద్యార్థులు, రన్నర్స్‌గా ముక్తేశ్వరం వైవీఎస్ అండ్ బీఆర్ఏం కళాశాల విద్యార్థులు నిలిచారు. తృతీయ స్థానంలో జి. మామిడాడ డీఆర్ ఎల్ డీగ్రి కళాశాల విద్యార్థులు నిలిచారు. విమెన్స్ విభాగంలో విన్నర్‌గా పెనుగొండ ఎస్‌వీకేపీ అండ్ బీకెఎస్ రాజు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల(ఎ), రన్నర్‌గా తణుకు ఎస్.కె.ఎస్. డి మహిళా కళాశాల, తృతీయ స్థానంలో ఏలూరు సీహెచ్ఎస్‌డీ సెయింట్ థెరిస్సా డిగ్రీ, కళాశాల నిలిచాయి. వివిధ కళాశాలల నుంచి మెన్స్ జట్టుకు ఏడుగురు, ఉమెన్స్ జట్టుకు ఏడుగురిని ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. వీరిని ముక్తేశ్వరం వైవీఎస్ అండ్ బీఆర్ఎం కళాశాల కరస్పాండెంట్ వై.కుమారస్వామి తదితరులు అభినందించారు.

వీరవల్లిపాలెంలో ఆడుదాం ఆంధ్రా

అయినవిల్లి: మండలంలోని వీరవెల్లిపాలెం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సచివాలయ వలంటీర్లకు క్రీడలపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమంలో వలంటీర్లు అందరికీ మండలంలో ఉన్న పీడీలు క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ వంటి ఆటలపై శిక్షణ ఇచ్చారు. క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ పి.సురేష్, ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య, వలంటీర్లు సుమారు 200 మంది పాల్గొన్నారు.

పొడివారం పాటించాలి



జొన్నాడలో పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందుకు ప్రతి శుక్రవారాన్ని పొడి వారం (డ్రై డే)గా పాటించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.మల్లికార్జున, పి.భవానీశంకర్ కోరారు. ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీనివల్ల క్రిమి, కీటకాలు దరి చేరవని, తద్వారా అంటు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది డ్రై డేను వివరిస్తూ ర్యాలీలు నిర్వహించారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలమణి పాల్గొన్నారు.

వంట పాత్రల పంపిణీ



చెముడులంకలో వంట పాత్రలను అందజేస్తున్న సర్పంచ్ తమ్మన

ఆలమూరు: మండలంలోని చెముడులంకలో ఉన్న వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథక కార్మికులకు అవసరమైన వంట పాత్రల పంపిణీ జరిగింది. స్థానిక గ్రామ సర్పంచ్ తమ్మన శ్రీనివాసు ఆధ్వర్యంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు ఆయా పాఠశాలలకు వెళ్లి సుమారు రూ.30 వేల విలువైన ఈ వంటపాత్రలను అందజేశారు. ఉప సర్పంచ్ దొండపాటి వీర వెంకట్రావు, పంచాయతీ కార్యదర్శి యు.రేణుక పాల్గొన్నారు.

మండల యూటీఎఫ్ అధ్యక్షుడిగా రామకృష్ణ

ఆత్రేయపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడిగా టి.రామకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూటీఎఫ్ జిల్లా సహాయ అధ్యక్షుడు పి.సురేంద్ర కుమార్, ఎన్నికల అధికారి సమక్షంలో జిల్లా సంఘ ప్రధాన కార్యదర్శి ఎస్.జ్యోతిబసు ఆధ్వర్యంలో కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా ఎస్‌వీవీఎస్ఎస్ ప్రసాద్, అధ్యక్షుడిగా రామకృష్ణ, సహాధ్యక్షురాలిగా డీడీ లక్ష్మీదేవి, ప్రధాన కార్యదర్శి సీహెచ్ సుధాకర్, కోశాధికారిగా కడలి ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పంటలను అధ్యయనం చేసిన రావేప్ విద్యార్థులు



ముంగండ గ్రామ పటాన్ని చిత్రీకరించిన రావేప్ విద్యార్థులు

పి.గన్నవరం: పశ్చిమ గోదావరి జిల్లా వెంకట రామన్నగూడెం డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయం రావేప్ విద్యార్థులు శుక్రవారం మండలంలోని ముంగండ గ్రామంలో పంటలను అధ్యయనం చేశారు. విద్యార్థులు జి.లహరి, కె.కీర్తన, కె.రోహిణి, కె.తేజస్విని రైతులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో పంట పొలాలు, కొబ్బరి, కోకో, ఆయిల్‌పామ్, కూరగాయల పంటల్లో అధునాతన సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామ స్వరూపం, సాగు పంటల విస్తీర్ణం, పంట కాలువలు, చెరువులతో కూడిన గ్రామ పటాన్ని చిత్రీకరించారు. పంచాయతీ కార్యదర్శి వాసు, రైతు నాయకులు సరెళ్ల అప్పారావు, పెచ్చెట్టి వెర్రియ్య, భావన పట్టాభి రామారావు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

పి.గన్నవరం: గ్రంథాలయ వారోత్సవాల్లో స్థానిక శాఖా గ్రంథాలయంలో శుక్రవారం లైబ్రేరియన్ జి.రవికుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈ నెల 20న జరిగే కార్యక్రమంలో బహుమతులు అందజేస్తారు.

30న పాస్టర్స్ ఆత్మీయ సమ్మేళనం

మామిడికుదురు: ఈ నెల 30వ తేదీన మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురంలో జరిగే పాస్టర్స్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు కనపాల బాబూరావు పిలుపునిచ్చారు. ఈదరాడ మహిమ మందిరంలో శుక్రవారం మండల శాఖ అధ్యక్షుడు టి.నాని అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాబూరావు మాట్లాడారు. జిల్లా కార్యదర్శి ఎస్.ప్రసాదరావు, సీహెచ్ స్టీవెన్, పి.రాజు, ఉచ్చుల విష్ణు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

సఖినేటిపల్లి: మండల పరిధిలోని అంతర్వేదిపాలెం శాఖా గ్రంథాలయంలో శుక్రవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నాలుగోరోజు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పుస్తకాలు–వాటి ప్రాధాన్యంపై, జనరల్ నాలెడ్జ్‌పై లైబ్రేరియన్ వై.వెంకటలక్ష్మి పోటీలను నిర్వహించారు. టీచర్ వివేకానంద పర్యవేక్షకుడిగా వ్యవహరించారు.

జీపీఎస్‌ను రద్దు చేయాలి

మామిడికుదురు: జీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని యూటీఎఫ్ మామిడికుదురు మండల శాఖ నూతన కమిటీ సమావేశం తీర్మానించింది. గౌరవాధ్యక్షురాలు ఏవీ శ్యామలావతి అధ్యక్షతన శుక్రవారం డీఆర్‌డీఏ కార్యాలయంలో సమావేశం జరిగింది. పలు తీర్మానాలను ఆమోదించారు. ఎంఈఓ మోకా వెంకన్నబాబు, మండల ప్రధాన కార్యదర్శి బాలం పెద్దిరాజు, జిల్లా కార్యదర్శి బేతినీడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బీజేపీ కో కన్వీనర్‌గా సత్యనారాయణమూర్తి

పి.గన్నవరం: నియోజకవర్గ బీజేపీ కో కన్వీనర్‌గా మండలానికి చెందిన టి.సత్యనారాయణమూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి నుంచి నియామకపు ఉత్తర్వులు అందాయి.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

మామిడికుదురు: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా 4వ రోజు శుక్రవారం మామిడికుదురు గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు ఏర్పాటు చేశారు. నేటి సామాజిక, ఆర్థిక పరిస్థితులపై ఈ క్విజ్ పోటీ జరిగింది. క్విజ్ పోటీల్లో విజేతలకు ఈ నెల 20వ తేదీన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా జరిగే సభలో బహుమతులు అందిస్తామని గ్రంథాలయ నిర్వాహకుడు కె.సూర్యనారాయణ తెలిపారు.